# హెడ్‌కానిస్టేబుల్‌ను హతమార్చిన కానిస్టేబుల్

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అరాచకాలను అరికట్టి, సామాన్య ప్రజలను రక్షించాల్సిన కానిస్టేబులే మరో హెడ్ కానిస్టేబుల్‌ను హత్య చేసిన ఉదంతమిది. ఆస్తి తగాదాలలో తన మాట కాదన్నాడని, అప్పుగా ఇచ్చిన మొత్తాన్ని ఉన్నపళంగా తిరిగివ్వమన్నాడన్న కక్షతో సొంత బావనే కిరాతకంగా నరికి హత్య చేశాడు. హంతకుడు, హతుడు ఇద్దరూ బాధ్యత కలిగిన పోలీసు శాఖలో పనిచేస్తున్నా, హత్య జరగగానే సకాలంలో కావాల్సిన సాక్ష్యాధారాలను సేకరించి, నిజానిజాలను కోర్టు ముందుంచి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చేశారు సరూర్‌నగర్ పోలీసులు. వివరాల్లోకి వెళితే...

హైదరాబాద్ పాత నగరంలో నివసించే జిట్ట సంజీవరెడ్డి (30) పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. అయితే తనకన్నా పై అధికారులను గౌరవించాలన్నా, వారికి విధేయుడుగా ఉండాలన్నా అతనికి నామోషి. పైగా సంపాదనంటే వల్లమాలిన పిచ్చి. అందుకే అతను జీతంతో తృప్తి పడలేకపోయాడు. ప్రత్యామ్నాయంగా ఏదైనా వ్యాపారం చేయాలని డ్యూటీకి డుమ్మాకొట్టి అనేక ప్రయత్నాలు చేసేవాడు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, అనేకమార్లు విధులకు గైర్హాజరు కావడం, విధి నిర్వహణలో అవినీతికి పాల్పడుతున్నాడని, సామాన్య ప్రజలను లంచాలకోసం పీడిస్తున్నాడని పలు ఆరోపణలు రావడంతో అతనిని పోలీసు ఉన్నతాధికారులు విధుల నుండి తొలగించి శాఖాపరమైన దర్యాప్తును చేపట్టారు. దాంతో అతనికి వ్యాపారం చేయడం తప్పనిసరైంది. వ్యాపారం చేద్దామంటే తనకంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాతనగరంలోని టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ చంపాపేట ప్రెస్‌కాలనీలో నివసించే అతని బావ సామ జనార్దన్‌రెడ్డి దగ్గరకు వెళ్ళి తన పరిస్థితిని వివరించాడు. జనార్దన్‌రెడ్డి కూడా ఏదో ఒక వ్యాపారం చేసి సంపాదించాలనుకుంటున్న వ్యక్తే. అందుకే సంజీవరెడ్డి అతనిని కలిశాడు. తనను అధికారులు ఉద్యోగం నుండి సస్పెండ్ చేశారని, ఏదైనా వ్యాపారం చేద్దామంటే తన దగ్గర సొమ్ములేవని నమ్మబలికాడు. సాధారణంగా డబ్బులివ్వడంలో ఒక్కపట్టాన మెత్తబడని జనార్దన్‌రెడ్డి అతని మాటలకు కరిగిపోయి ఏదైనా మంచి లాభం వచ్చే వ్యాపారం చేసుకోమని చెప్పి అతనికి 70 వేల రూపాయలు అప్పిచ్చాడు. కాని వడ్డీ మాత్రం నెలానెలా క్రమం తప్పకుండా కట్టాలని, ఎక్కడైనా బావమరిదిగాని డబ్బుదగ్గర కాదని గుర్తు చేసి మరీ ఇచ్చాడు.

అంతే... అలా డబ్బు తీసుకుని వెళ్లిపోయిన బావమరిది మళ్లీ తన గడప తొక్కకపోవడంతో ఎదురు చూసి చూసి విసిగిపోయిన జనార్ధన్‌రెడ్డి ఒకసారి సంజీవరెడ్డి దగ్గరకు వెళ్ళి తన అప్పు, దాని తాలూకు వడ్డీ సంగతి ప్రస్తావించాడు. దానికతను కొంతకాలం గడువు కోరడంతో వెనుదిరిగి వచ్చాడు. అలా నాలుగైదుసార్లు జరగడంతో ఒకసారి తనకెదురు పడ్డ సంజీవరెడ్డిని తన బాకీ చెల్లించమని నిలదీశాడు. దాంతో అతని అహం దెబ్బతిని సొంత బావమరిదిని నలుగురులో పట్టుకుని బాకీ తీర్చమని అడుగుతావా అని జనార్దన్‌రెడ్డిపై తిరగబడ్డాడు. ఈ విషయంలో ఇద్దరూ చాలాసేపు ఘర్షణపడిన తరువాత ఉద్యోగంలో ఉన్న జనార్ధన్‌రెడ్డి సంజీవరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో అతనిని పోలీసులు పిలిచి విచారించారు. ఇంతలో ఇరువైపుల పెద్దలు కూర్చొని వారి మధ్య రాజీ కుదిర్చి జనార్దన్‌రెడ్డి సంజీవరెడ్డికి ఇచ్చిన మొత్తానికి వడ్డీ ఏమీ లేకుండా అసలు రెండు నెలల తరువాత ఇచ్చేలా తీర్మానించారు. ఒక పక్క వడ్డీ పోతుందని మనసులో బాధ ఉన్నా, బావమరిది దగ్గర్నుండి అసలు రావడమే గగనమని భావించిన జనార్ధన్‌రెడ్డి ఆ ఒప్పందానికి ఒప్పుకున్నాడు. ఈ గొడవ జరిగాక అవసరానికి డబ్బిచ్చి, అది ఇవ్వలేదని సొంత బావవై ఉండి పది మందిలో పోలీస్‌టౌన్‌కీడుస్తావా, పది మందిలో పంచాయితీ పెడతావా నీ




అంతు చూస్తానంటూ... జరిగిన సంఘటనపై మనసులో కక్ష పెంచుకున్నాడు సంజీవరెడ్డి. అందుకే పెద్దల ముందు చెప్పిన మాటకు కట్టుబడకుండా, అతని కంట పడకుండా తప్పించుకు తిరగసాగాడు.

ఆ రోజు సెప్టెంబర్ 15, 1996, సమయం తెల్లవారుజామున 330 గంటలవుతుంది. ఆయాసంతో రొప్పుకుంటూ ఒక మహిళ సరూర్‌నగర్ పోలీసుస్టేషన్‌కు వచ్చింది. గార్డు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఏమైందని ఆదుర్దాగా ప్రశ్నించాడు. నా భర్తను ఎవరో చంపేశారు. అని ఆమె చెబుతుండగానే... ఆమె ఆయాసంతో చెబుతున్న మాటలు అతనికి పూర్తిగా అర్థం కాకపోయినా, ఆమె పడుతున్న ఆందోళనను గమనించి లోపలికి వెళ్ళమని సైగ చేశాడు. ఆమె అదే స్పీడుతో లోపలికి వెళ్ళి అక్కడ ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌తో జరిగిన ఘోరం గురించి వివరించడం మొదలుపెట్టింది. నా పేరు సామా విజయలక్ష్మి, మేము చంపాపేట ప్రెస్ కాలనీలో ఉంటాము. నా భర్త టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్. అతని పేరు జనార్ధన్‌రెడ్డి. అతనిని ఎవరో కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చాలని చూశారు. కొన ఊపిరితో ఉన్న అతనిని మేము ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్ళాము. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైతేనేగాని చికిత్స చేయలేమని చెప్పేశారు డాక్టర్లు. మీరు త్వరగా వివరాలు నమోదు చేసుకుని నా భర్త ప్రాణాలను కాపాడండి అంటూ బోరున ఏడ్వడం మొదలుపెట్టింది ఆమె. వెంటనే అతను ఇన్‌స్పెక్టర్ ఎమ్. లక్ష్మీనారాయణకు టెలిఫోన్ ద్వారా విషయాన్ని వివరించాడు. దానికి ఆయన నేను వస్తున్నాను, ఈ లోపు నీవు ఆమెతోపాటు ఆసుపత్రికి వెళ్ళి వైద్యం అందేలా చూడమని చెప్పడంతో అతను వెంటనే ఆమెను తీసుకుని ఆసుపత్రికి వెళ్ళి అతనిని ఎమర్జెన్సీ వార్డులో చేర్పించాడు. అతనికి వైద్యులు చికిత్స చేయడం ప్రారంభించారు. అప్పటికే అతనిని నాలుగైదు చోట్ల విచక్షణారహితంగా నరికివేయడంవల్ల విపరీతమైన రక్తస్రావం జరిగింది. దానివల్ల అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు. అయినా డాక్టర్లు అతనిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయం ఉస్మానియా ఆసుపత్రికి వచ్చి బాధితుడ్ని పరామర్శించిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ అతనిపై హత్యాయత్నం జరిగినట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆయన వెళ్ళిన కొంతసేపటికే జనార్ధన్‌రెడ్డి మరణించాడని సమాచారం అందడంతో కేసును హత్యానేరంగా మార్చి దర్యాప్తును వేగవంతం చేశాడు.

దర్యాప్తులో జనార్ధన్‌రెడ్డి సోదరులు ఈ హత్యవెనుక అతని బావమరిది సంజీవరెడ్డి హస్తం ఉందని బలమైన అనుమానం వ్యక్తం చేయడం, దానికి ఇంకా బలమైన సాక్ష్యాధారాలను చూపించడంతో పోలీసులు ఆ కోణంలోనే దర్యాప్తు చేశారు. ఎలాగైతేనో చాలా తెలివిగా పథకం ప్రకారం హత్య చేసి తప్పించుకోవాలని చూసిన సంజీవరెడ్డిని, అతనికి సహకరించిన అతని సోదరుడు రామిరెడ్డిని, మరో అనుచరుడు బక్కా రాజిరెడ్డిని అరెస్ట్ చేశారు. వారు హత్యకు ఉపయోగించిన కత్తులతోపాటు పూర్తి ఆధారాలు పోలీసులకు దొరికినా, వారే ఈ హత్య చేసినట్లు ఒప్పుకోకపోవడంవల్ల సుమారు 15 మంది సాక్షులతో, పకడ్బందీ సాక్ష్యాధారాలతో వారిని సరూర్‌నగర్ పోలీసులు కోర్టుకు అప్పగించారు. దాంతో అన్ని కోణాలలోను సాక్షులను విచారించిన న్యాయమూర్తి బాధ్యత కలిగిన పోలీసు శాఖలో పనిచేసి, అదే శాఖలో పనిచేస్తున్న సొంత బావను దారుణంగా హతమార్చిన సంజీవరెడ్డికి జీవిత కఠిన కారాగార శిక్షను, అతనికి సహకరించిన ఇద్దరికి చెరో ఐదేళ్లు కఠిన శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో నిష్పక్షపాతంగా వ్యవహరించి, కచ్చితమైన సాక్ష్యాధారాలను కోర్టుకు అందించిన సరూర్‌నగర్ పోలీసులను అభినందించారు.

**నీలం రాంబాబు నాయుడు**




ఎస్. కె. ఇమామ్

జనార్ధన్‌రెడ్డిని హతమార్చిన సంజీవరెడ్డి పోలీస్ కానిస్టేబులే అయినా అతనికి శిక్ష పడాలని సరూర్‌నగర్ కోర్టు కానిస్టేబుల్ పి. బాలయ్య, ప్రొసెస్ కానిస్టేబుల్ ఎస్. కె. ఇమామ్‌లు చాలా చిత్తశుద్ధిగా వ్యవహరించారు. ఎలాగంటే 15 మంది సాక్షులను కోర్టు కోరినప్పుడల్లా తీసుకెళ్ళడం. వారు వేరే పనులమీద వెళ్ళిపోకుండా ఒకరోజు ముందు వారికి కోర్టుకు రావాలన్న విషయాన్ని గుర్తు చేసి, కోర్టుకు తీసుకురావడం. సాక్షులను సకాలంలో తేలేకపోతే, తాను చేసిన నేరం మరుగున పడిపోతుందని భావించిన

## పట్టువదలని విక్రమార్కులు వీరు

సంజీవరెడ్డి బయటనున్న తన అనుచరులతో వీరిద్దరిని సైతం బెదిరించాడు. అయినా వారు లెక్క చేయకుండా పట్టు వదలని విక్రమార్కుల్లా సంజీవరెడ్డికి శిక్ష పడేదాకా కోర్టు కోరినప్పుడల్లా సాక్షులను హాజరుపరిచారు. చివరికి సంజీవరెడ్డికి, అతని అనుచరులకు శిక్ష పడేలా తమవంతు కృషి చేశారు. ఈ తీర్పు వెలువడిన అనంతరం ఈ కేసులో పరిశోధన ఒక ఎత్తైతే, సాక్షులను క్రమం తప్పకుండా హాజరు పరిచిన బాలయ్య, ఇమామ్‌లు చేసిన కృషి ఒకెత్తని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అటు న్యాయమూర్తి నుండి, ఇటు సైబరాబాద్ కమిషనర్ ఎమ్. మహేందర్‌రెడ్డి నుండి ప్రశంసలు అందుకున్న వీరిద్దరికీ లైజెనింగ్ అధికారిగా వ్యవహరించిన మొహినుద్దీన్‌ను కూడా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.



పి. బాలయ్య